క్లుప్తంగా

భూ సమస్యలపై అర్జీల వెల్లువ



అధికారులకు భూ సమస్యలు వివరిస్తున్న రైతులు

త్రిపురాంతకం: రెవెన్యూ గ్రామసభలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు 120 మంది అర్జీలు అందజేశారు. అర్జీలు వెల్లువలా రావడంతో తహసీల్దార్ రామకృష్ణ శివప్రసాద్ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని విశ్వనాథపురంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలపై రైతులు స్పందించారు. ప్రధానంగా ఆన్‌లైన్, భాగ పంపకాల భూసమస్యలు సభ దృష్టికి వచ్చాయి. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రైతులు కోరారు. ఆర్‌ఐ ముకుందహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట శిబిరాలపై బుధవారం స్థానిక ఎస్‌ఐ సంపత్‌కుమార్ దాడులు చేశారు. అందులో భాగంగా ముటుకులలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.6,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: గ్రామాల్లోని ప్రజలు తమ భూముల సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. బుధవారం మండలంలోని కొచ్చెర్లకోట పంచాయతీ పరిధి సిద్ధాయపాలెంలో భూముల రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి సమస్యలు ఏవైనా ఉంటే రెవెన్యూ సదస్సులో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. తమ వీఆర్‌ఓలతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దీనిలో ఎవరి ప్రమేయం ఉండదని, అర్జీదారు నేరుగా తహసీల్దార్‌ను కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. వీఆర్‌ఓ ఏసయ్య, సర్వేయర్లు మస్తాన్ దర్బార్‌వలి, సీహెచ్ వెంకట్రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై గిరిజనులకు అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బందం బావిలో సీజనల్ వ్యాధులపై గిరిజనులకు బుధవారం అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా కురుస్తున్న ఆకాల వర్షాలతో మలేరియా, డెంగీ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. సూపర్‌వైజర్ కందుల ఇశ్రాయేలు, ఏఎన్‌ఎం బేగం, ఆశాలు మరియమ్మ, లక్ష్మీదేవి, చిన్నిబాయి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



మోటార్ సైకిల్‌పైకి ఎక్కిన కారు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని రెడ్డినగర్ సమీపంలో కారు.. మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అద్దంకి నుంచి దర్శికి వస్తున్న కారుకు ఎదురుగా కూలీలతో ఓ ఆటో వస్తోంది. ఆటోను తప్పించబోయి దర్శి మండలం కట్టుబడివారిపాలేనికి చెందిన నాగేష్ మోటార్ సైకిల్‌పైకి కారు దూసుకెళ్లింది. కారు మార్జిన్ దిగి మోటారు సైకిల్‌పై నుంచి సైడ్ డ్రైన్‌లోకి దూసుకెళ్లి గుంతలో పడింది. మోటార్‌సైకిల్‌పై కారు నిలబడింది. దీంతో కారులో ఉన్న సందు శివలీల కాలికి గాయమైంది. అందులో ప్రయాణిస్తున్న నాగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు చిల్లచెట్లలో ఇరుక్కుపోయింది. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలంకారంగా సంపద కేంద్రాలు



పెద్దారవీడులో చిల్లకంపతో డంపింగ్ యార్డు



మద్దలకట్టలో మూలకు చేరిన చెత్త రిక్షాలు

పెద్దారవీడు:

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మండలంలో అస్తవ్యస్తంగా మారింది. ఇంటింటి నుంచి చెత్త సేకరించడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వం భావించింది. చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చడం ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీల అభివృద్ధికి దోహదపడుతుందని తలచి చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటికి తోడు చెత్త సేకరించేందుకు పంచాయతీలకు కేటాయించిన రిక్షాలు కొన్ని గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణపై పట్టించుకోవాల్సిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. రోడ్ల వెంబడి పేరుకు పోతున్న చెత్తను చూసి అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను అధికారులు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరి చిల్లకంపతో నిండి ఉన్నాయి. పలు గ్రామాల్లో డంపింగ్ యార్డులు వినియోగంలోకి రాకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారాయి.



దేవరాజుగట్టులో నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ఎక్కడి చెత్త అక్కడే

పెద్దారవీడు మండలంలో మొత్తం 19 పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎందుకూ పనికి రాకుండా దర్శనమిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.లక్షలు ఖర్చు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారే గానీ వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. గృహాల నుంచి చెత్తను సంపద కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు రెండు రిక్షాలు, ఇంటింటికీ రెండు చెత్త డబ్బాలు పంపిణీ చేసింది. సంపద కేంద్రాలు గ్రామాల్లో వినియోగంలో లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసినా రోడ్ల పక్కన చెత్త కుప్పలుగా పేరుపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెత్త కారణంగా దోమలు వ్యాప్తి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సంపద కేంద్రాలు వృథాగా పడి ఉండటంతో అధికారుల తీరును ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డ్ కేంద్రాలు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి వచ్చినా వినియోగంలో తీసుకురావడంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గ్రామాల్లో స్వచ్ఛ భారత్ లక్ష్యం క్షేత్ర స్థాయిలో నీరుగారి పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



తారు రోడ్డు పక్కనే చెత్తాచెదారం



సాగులో ఉన్న పత్తిపంట

పత్తిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

దొనకొండ: పత్తి ప్రధాన వాణిజ్య పంట. పత్తిలో దిగుబడి, నాణ్యతపరంగా తీవ్రనష్టం కలిగించేది గులాబీ రంగు పురుగు ఒకటని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తుంటారు. పురుగుతో రైతుకు 50 శాతం నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. 2002 సంవత్సరంలో బీటీ పత్తి మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత గులాబీ రంగు కనుమరుగైంది. రైతులు పదేళ్ల నుంచి బీటీ పత్తి సాగు చేయటంతో అతి ప్రమాదకరమైన శనగపచ్చ పురుగు, గులాబీ పురుగు అదుపులో ఉన్నాయి. రైతులు సమగ్ర యాజమాన్యంతో మాత్రమే గులాబీ రంగు పురుగును ఎదుర్కొని పత్తి పంటను కాపాడుకుంటున్నారు. వ్యవసాయ శాఖ గ్రామాల్లోని రైతులకు పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి, నష్ట పరిచే విధానం నివారణపై అవగాహన కల్పించారు. పత్తి పంటకు పురుగు కలిగించే నష్టాన్ని అంచనా వేయటం చాలా కష్టమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. గొంగలి పురుగు మాత్రం గుడ్డు నుంచి వెలువడిన వెంటనే పూత, కాయ లోపలి భాగానికి చొచ్చుకెళ్లి నష్టాన్ని కలుగజేస్తుంది. ఈ పురుగు ఆశిస్తే పత్తి పూలు విచ్చుకోకుండా గుడ్డి పూలుగా మారతాయి. ఫలితంగా కాయల పక్వానికి రాకముందే పగిలిపోతాయి. దీని ఫలితంగా దూది నాణ్యత, దిగుబడి గణనీయంగా తగ్గుతాయి. ఈ పురుగు పంట చివరి దశలో ఏర్పడే పూత కాయలకు నష్టం కలిగిస్తుంది. సెప్టెంబర్ మొదలుకొని పంట పూర్తయ్యే వరకు చెట్లపైనే ఉంటుంది. గులాబీ రంగు పురుగు మాత్రం ఏ పుగా పెంచిన పొలాల్లో ఆశిస్తుంది. రైతులు సస్యరక్షణ చర్యలతో గులాబీ రంగు పురుగు ఉధృతిని కొంత వరకు నియంత్రించేందుకు అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ వివరించారు.



క్రిమిసంహారక మందులు తగ్గించాలి: ఈ ఏడాది సాగు చేసిన పత్తి పంట సకాలంలో ఏపుగా పెరిగింది. దిగుబడి వస్తాది అనుకున్న సమయానికి వర్షాలు ఉధృతం కావటం, కాయలు రాలి పోవటం, గులాబీ, గొంగళి పురుగు ఆశించటం, పూత రాలి పోవటం, పొలాల్లో నీరు నిల్వ ఉండి పత్తి చెట్ల ఆకులు వాడిపోయినట్లు కనపడుతున్నాయి. రైతులు క్రిమిసంహారక మందులు తగ్గిస్తే తగు మోతాదులో దిగుబడి పొందొచ్చు.

ఎస్.లక్ష్మీనారాయణ, ఏఓ, దొనకొండ

అధిక తేమ నుంచి పత్తిని కాపాడుకోవాలి



కురిచేడు: రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్



ముండ్లమూరు: వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

యర్రగొండపాలెం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో అధిక తేమ ఉంటుందని, ఈ తేమ నుంచి రైతులు తమ పంటలను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అమానిగుడిపాడు, వాదంపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయనతో పాటు ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి పాల్గొని పత్తి, మిరప, కంది పంటలను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ పత్తి పంట అధిక తేమతో మొక్కలు భూమి నుంచి పోషకాలను గ్రహించే స్థితిలో ఉండవని, ఇటువంటి పరిస్థితుల్లో మొక్కలు ఎర్రబడటం, వడలి పోవడం, ఎండి పోవడం లాంటివి జరుగుతాయని తెలిపారు. ఈ పరిస్థితుల నివారణకు 20 గ్రాముల యూరియా లేకుంటే 20 గ్రాముల పొటాషియం నైట్రేట్, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌తో లీటర్ నీటిని కలిపి 5 నుంచి 7 రోజుల కాలంలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆకు మచ్చ తెగులు కూడా ఆశించే అవకాశం ఉందని, దాని నివారణకు మూడు గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలన్నారు. హెచ్‌వో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, పవర్ వీడర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. పొలాల్లో తేమ ఆరిన వెంటనే పైపాటుగా 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం ఇచ్చే ఎరువులు చల్లాలన్నారు. మిరప పంటలో వేరు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, దాని నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్, గ్రాము ప్లాంటో మైసిన్ లీటర్ నీటిలో కలిపి మొక్క మొదలు దగ్గర పోసి తెగులు నివారించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు ఎల్.మాల్యాద్రిరెడ్డి, డి.ధనేశ్వర్ నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది సీహెచ్ వివేక్ శిశిర, టి.రంగనాయకులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): ఇటీవల కురిసిన వర్షాలకు వరి, కంది, మినుము పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని డీఆర్‌సీ వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ అన్నారు. మండలంలోని పులిపాడు, పెద్ద ఉల్లగల్లు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ వరి పంటలో ఉల్లికోడు సమస్య ఎక్కువగా ఉందన్నారు. నివారణకు నత్రజని ఎరువును సిఫార్సు మేరకు వాడాలని సూచించారు. వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. వీఏఏ ఆంజనేయులు, షేక్ రజాక్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ బుధవారం మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం, చిన్నగుడిపాడుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, పత్తి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవ జీవామృతం తయారు చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రధాన మంత్రి పసల్ బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ కాలంలో శనగ, మినుము, జొన్న, మిరప, మొక్కజొన్న, వరి తదితర ఆరు పంటలకు బీమా చేసుకోవచ్చన్నారు. వెంకటేశ్వర్లు, నీలానాయక్, హరిజననాయక్ పాల్గొన్నారు.



పెద్దదోర్నాల: ద్రవ జీవామృతం తయారు చేస్తున్న రైతులు

కురిచేడు: మండలంలో సాగు చేసిన పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ బాలాజీనాయక్ కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన ఏఓ మధుబాబు, సిబ్బందితో కలిసి మండలంలోని పమరవీరాయపాలెం, ఆవులమంద గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు సూచనలు చేస్తూ సస్యరక్షణ గురించి వివరించారు. ఏఓ మధుబాబు మాట్లాడుతూ రైతులు పంటల్లో కనిపించిన పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యవసాయ శాఖలో అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. వీఏఏలు డి.హారిక, మల్లికార్జున నాయక్, రైతులు పాల్గొన్నారు.



వై.పాలెం: రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పోలీసుస్టేషన్‌లో ఓపెన్ హౌస్

పుల్లలచెరువు: పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసుస్టేషన్ ప్రాముఖ్యత, పోలీసుల విధులు, ఆయుధ పరికరాల గురించి విద్యార్థులకు ఎస్‌ఐ సంపత్‌కుమార్ అవగాహన కల్పించారు. సమాజంలో పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలని, అందుకు పోలీసులు సమర్థంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీసులకు, ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం, అపద జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, గుర్తులు, పోలీసుస్టేషన్‌లో అన్ని విభాగాలకు చెందిన వాటి గురించి విద్యార్థులకు పూర్తిగా అవగాహన కల్పించారు. వైర్‌లెస్ సెట్ గురించి, పోలీసులు వినియోగించే ఆయుధాల గురించి వివరించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకోవాలి

- డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వర్

పుల్లలచెరువు: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి సులువు అవుతుందని మార్కాపురం డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ ఇష్టంతో కష్ట పడి చదువుకోవాలన్నారు. ఏదైనా డౌట్‌లు ఉంటే వెంటనే ఉపాధ్యాయులు అడిగి తెలుసుకోవాలన్నారు. పదో తరగతిలో నూరు శాతం వచ్చే విధంగా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న చోట విద్యావలంటీర్లను త్వరలో నియమించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారికి అభివృద్ధికి బాటలు వేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈయన వెంట ఎంఈవో ఇందిర, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వర్

సీజన్ వ్యాధులపై అవగాహన

దొనకొండ: గ్రామాల్లోని ప్రజలకు సీజన్ వ్యాధులపై సరైన అవగాహన కల్పించి మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు లేని మండలంగా దొనకొండను చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖలకు చెందిన అధికారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సూచించారు. వైద్యాధికారి కె.సునీత మాట్లాడుతూ గ్రామాల నుంచి ప్రజలు వైద్యశాలలకు వచ్చిన వారికి అన్ని పరీక్షలు చేసి తమ సిబ్బంది ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. ఆరోగ్యపరమైన సూచన, సలహాలు ఆమె అందించారు. వైద్యాధికారి కె.సునీత, మండల విస్తరణాధికారి షేక్ షఫీ, ఎంఈఓ ఎస్.సాంబశివరావు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి సునీత

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

పెద్దదోర్నాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించారు. భూములకు సంబంధించిన అన్ని రికార్డులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి ఎరువుల స్టాక్ తదితర వివరాలు అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించి వాటిలో ఒక ఉత్తమ కార్యాలయాన్ని ఎంపిక చేస్తామన్నారు. తదనంతరం ఆ కార్యాలయానికి ఉత్తమ తహసీల్దార్ కార్యాలయంగా ఎంపిక చేసి అవార్డు ఇవ్వనున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ శాంతి పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పుల్లలచెరువు: చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండటం సాధ్యం అవుతుందని కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రోజూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. అలా కాని పక్షంలో చేతులకు ఉన్న మట్టి కడుపులోకి చేరి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించి చక్కగా చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హ్యాండ్ వాష్ సబ్బులతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు